

మార్కాపురం మున్సిపల్ బడ్జెట్ రూ.45.26 కోట్లు

మార్కాపురం పురపాలక సంఘానికి సంబంధించి 2025-26 బడ్జెట్‌ను ఆమోదించారు.

- 8లో..



అంధులం.. అడుగుతున్నాం న్యాయం

విభిన్న ప్రతిభావంతుల బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని అంధ అభ్యర్థులు నిరసన తెలిపారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం 36/23

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పొగమంచు కురుస్తుంది. రాత్రి చలిగాలులు వీస్తాయి.

రంజాన్ వేళలు

మంగళవారం ఇఫ్తార్ సాయంత్రం గం 6 : 30

బుధవారం సహోరి ఉదయం గం 4 : 52

న్యూస్‌రీల్

మెగా డీఎస్సీ ఉచిత ఆన్‌లైన్ శిక్షణ

ఒంగోలు సిటీ: మెగా డీఎస్సీ 2025 పరీక్షల ఉచిత ఆన్‌లైన్ శిక్షణకు ప్రకాశం జిల్లాకు చెందిన బీసీ, ఈడబ్ల్యూఎస్(ఈబీసీ) అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఏపీ బీసీ స్టడీ సర్కిల్ ఒంగోలు సంచాలకులు ఎం.అంజల సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సంచాలకులు అంజల మాట్లాడుతూ డీఎస్సీ ఆన్‌లైన్ శిక్షణకు ఈ నెల 10వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. అర్హులైన అభ్యర్థులు తమ విద్యార్హత నకళ్లు, టెట్ మార్కుల నకళ్లు, కులధ్రువీకరణ పత్రం నకలు, ఆదాయ ధ్రువీకరణ పత్రం నకలు, ఆధార్ నకలు, 2 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న గవర్నమెంట్ ఆఫీస్ కాంప్లెక్స్‌లో ఉన్న ఏపీ బీసీ స్టడీ సర్కిల్ ఒంగోలు లోని ఆఫీసు ఫోన్ నంబరు 08592-231232, 9989285530, 89850 90926 నంబర్లను సంప్రదించగలరని తెలిపారు.

అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి దరఖాస్తులు

ఒంగోలు సిటీ: భారత రక్షణశాఖ త్రివిధ దళాల రిక్రూట్‌మెంట్‌లో విప్లవాత్మక సంస్కరణల కోసం అగ్నిపథ్ పథకంలో భాగంగా భారత ఆర్మీలో అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ ఆఫీస్ అసిస్టెంట్/స్టోర్ కీపర్ టెక్నికల్, అగ్నివీర్ ట్రేడ్స్‌మెన్ విభాగాల్లో ఉద్యోగ నియామకాలకు అర్హులైన యువకులు ఆన్‌లైన్ ద్వారా ఏప్రిల్ పదో తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని స్టెప్ సీఈఓ శ్రీమన్నారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సీఈఓ శ్రీమన్నారాయణ మాట్లాడుతూ ఈ ఉద్యోగాల నియామకానికి రాత పరీక్ష తెలుగులో నిర్వహిస్తారన్నారు. అలాగే ఎన్‌సీసీ ఏ, బీ, సీ సర్టిఫికెట్లు ఉన్నవారు, క్రీడాకారులకు ప్రత్యేక బోనస్ మార్కులు ఉంటాయని తెలిపారు. www.joinindianarmy.nic.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

బధిరుల సంఘ నూతన కార్యవర్గం ఎంపిక



విభిన్న ప్రతిభావంతుల ఏడీని కలిసిన బధిరుల సంఘం నూతన కార్యవర్గం

ఒంగోలు వన్‌టౌన్: బధిర సంఘం నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఎంపిక చేసుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం సోమవారం జిల్లా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడీ అర్చనను ఏడీ చాంబర్‌లో కలిశారు. ఏడీని కలిసిన వారిలో సంఘం అధ్యక్షుడు యం రాజేంద్ర, ఉపాధ్యక్షుడు సీహెచ్ ఏడుకొండలు, ప్రధాన కార్యదర్శి యం.నాగిరెడ్డి, కోశాధికారి యం సునీల్, సంయుక్త కార్యదర్శి జీ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్బన్ ప్రాపర్టీస్ డిజిటలైజేషన్

ఒంగోలు సబర్బన్: అర్బన్ ప్రాపర్టీస్ డిజిటలైజేషన్ చేయటానికి ఒంగోలు నగర పాలక సంస్థ ఎంపికైందని నగర కమిషనర్ కే.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం విడుదల చేసిన ప్రకటనలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలోని పలు మున్సిపాలిటీలను ఎంపిక చేసిందని, వాటిలో ఒంగోలు కూడా ఉందన్నారు. నేషనల్ జియో స్పేషియల్ నాలెడ్జ్ బేస్డ్ సర్వే ఇన్ హేబిటేషన్స్ ఇన్ అర్బన్ ఏరియాస్ (నక్షా) ప్రోగ్రాం కింద కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందని చెప్పారు. డిజిటలైజేషన్ పూర్తి చేసుకున్న నగర పాలక సంస్థలకు మూడు విడతలుగా రూ.30 కోట్లు ఇన్‌సెంటివ్‌గా అందిస్తుందన్నారు. ఈ పథకం కింద ఒంగోలు నగర పాలక సంస్థలోని హేబిటేషన్స్ అన్నీ డ్రోన్ కెమెరాతో ఇమేజెస్ తీసుకుంటారన్నారు. ఈ ఆర్థో రెక్టిఫైడ్ ఇమేజ్ (ఓఆర్ఓ) ఆధారంగా ఇంటింటి సర్వే నిర్వహించటానికి టీములు ఏర్పాటు చేస్తారని వెల్లడించారు. ఈ టీములు రోజువారీ నిర్దేశిత ప్రాంతాల్లో ఓఆర్ఐ ఆధారంగా ఇంటింటి పాలిగాన్స్‌ను తయారు చేస్తారన్నారు. దీనిని గ్రౌండ్ ట్రూతింగ్ ప్రక్రియ అంటారు. దీనికి సుమారు 45 రోజులు పడుతుందన్నారు. ఈ నక్షా పథకం వలన ప్రజల ఆస్తులకు రక్షణ ఉండటమే కాక సరిహద్దుల గొడవలు శాశ్వతంగా పరిష్కారమవుతాయని వివరించారు. ఈ నెల 26వ తేదీ నుంచి రోవర్ల సహాయంతో సర్వేకు వచ్చే సెక్రటరీల టీమ్‌కు ప్రజలు సహకరించాల్సిందిగా కోరారు.

నల్లమల వన్యప్రాణుల భూతల స్వర్గం. వైవిధ్యభరితమైన జంతువులకు కేరాఫ్ అడ్రస్. అరుదైన జంతు, వృక్ష సంపదకు నిలయం. జీవ వైవిధ్యానికి నిలయంగా ఉన్న ఇక్కడ వన్యప్రాణుల సంరక్షణకు అటవీశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా వేసవిలో దాహార్తి తీర్చేందుకు దృష్టి సారించారు. ఎండాకాలం అటవీ ప్రాంతంలో ఉంచే నీటి చలమలు, నీటి మడుగుల్లో జలాలు అడుగంటిపోతాయి. దీంతో వన్యప్రాణులు నీటి కోసం జనావాసాల వైపు పరుగులు తీస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో ప్రమాదాలకు గురవుతున్నాయి. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని తాగు నీటి వనరులను అందుబాటులో ఉంచేందుకు అటవీశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. అటవీ ప్రాంతంలో సహజ సిద్ధంగా ఉన్న నీటి కుంటల్లో, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 150 సాసర్ పిట్లలో నీటిని నింపుతున్నారు.



నల్లమలలో సాసర్ పిట్ వద్ద నీరు తాగుతున్న జింకలు

- నల్లమలలో వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు
- వేసవిలో అడుగంటుతున్న నీటి వనరులు
- నీటిని అందుబాటులోకి తెచ్చేందుకు ప్రత్యేక దృష్టి
- జనావాసాల వైపు వెళ్లకుండా ఉండేలా చర్యలు
- అందుబాటులోకి 150 సాసర్‌పిట్లు
- 40 కుంటల్లో ప్రత్యేకంగా నీటి సౌకర్యం
- 20 సోలార్ పంప్‌సెట్ల ఏర్పాటు

అడుగంటుతున్న ప్రాణాలకు.. జలజీవం!

మార్కాపురం: వేసవి కాలం మొదలైపోయింది. ఇప్పుడే 41 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మనుషులే ఎండవేడికి ఇబ్బంది పడుతున్న పరిస్థితుల్లో వన్యప్రాణుల సంగతి సరేసరి. ఈ పరిస్థితుల్లో అటవీశాఖాధికారులు వీటి సంరక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ప్రకాశం, గుంటూరు, కర్నూలు, తెలంగాణ రాష్ట్రంలోని మహబూబ్‌నగర్ జిల్లాల్లో సుమారు 10 లక్షల ఎకరాల్లో నల్లమల అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. జిల్లాలో మార్కాపురం పరిధిలో 900 చదరపు మీటర్ల విస్తీర్ణం ఉంది. పెద్ద పులలతో పాటు వేల సంఖ్యలో జింకలు, దుప్పులు, నెమళ్లు తదితర వన్యప్రాణులకు నల్లమల అటవీ ప్రాంతం నెలవుగా ఉంది. మార్కాపురం అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్ పరిధిలో మార్కాపురం, యర్రగొండపాలెం, గంజివారిపల్లె, గుంటూరు జిల్లాలోని విజయపురి సౌత్ రేంజ్‌లు ఉండగా, గిద్దలూరు పరిధిలో గిద్దలూరు, గుండ్లకమ్మ, తురిమెళ్ల, కనిగిరి, ఒంగోలు ఉన్నాయి. వేసవి వచ్చిందంటే అటవీ ప్రాంతంలో ఉండే నీటి చలమలు, నీటి మడుగుల్లో జలాలు అడుగంటి పోతాయి. తాగునీటి కోసం దోర్నాల-శ్రీశైలం, దోర్నాల-ఆత్మకూరు రహదారి పైకి, గ్రామాల వైపు వన్యప్రాణులు వెళ్తున్నాయి. ఆక్రమంలో అవి వేటగాళ్ల ఉచ్చులకు బలవుతున్నాయి. మరికొన్ని రోడ్డు ప్రమాదాల బారిన పడి మృత్యువాత పడుతున్నాయి. ఇవి అటవీ ప్రాంతాన్ని వదిలిరాకుండా ఉండేందుకు అధికారులు ప్రత్యేక ప్రణాళికతో చర్యలు తీసుకుంటున్నారు. మార్చి రెండో వారం నుంచే ఉష్ణోగ్రతలు పెరుగుతూ వస్తున్నాయి. రానున్న రోజుల్లో వీటి తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. వన్యప్రాణులకు నీటి వనరులు అందుబాటులో ఉంచేందుకు అధికారులు దృష్టి సారించారు. నీటి వనరుల కోసం ఏటా లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. ఈ ఏడాది అటవీ ప్రాంతంలో 150 సాసర్‌పిట్లు ఏర్పాటు చేసి ట్యాంకర్ల ద్వారా నీటితో నింపుతున్నారు. వీటితో పాటు సహజసిద్ధంగా 275 నుంచి 300 నీటి కుంటలు ఉన్నాయి. వీటికి అదనంగా 40 నీటి కుంటలు ఏర్పాటు చేశారు. 20 సోలార్ పంప్‌సెట్ల ద్వారా నీటిని నింపుతున్నారు. దీంతో పెద్ద పులులు, చిరుతలు, దుప్పులు ఇతర వన్యప్రాణులు అక్కడికి వచ్చి నీళ్లు తాగుతున్నాయి. సీసీ కెమెరాల ద్వారా వీటి కదలికలను పరిశీలిస్తున్నారు.

బేస్ క్యాంపుల ఏర్పాటు

వాటి కదలికల కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. గంజివారిపల్లె సమీపంలోని పెద్దన్న బేస్ క్యాంప్, ఇష్టకామేశ్వరి, దొరబైలు, నారుతడికల, పాలుట్ల, కొలుకుల, తుమ్మలబైలు, వెదురుపడియ, కొర్రపోలు, చినమంతనాల, రోళ్లపెంట తదితర ప్రాంతాల్లో బేస్ క్యాంప్‌లు ఉన్నాయి. ఇందులో ఐదుగురు అటవీ అధికారులు ఉంటారు. అడవిలోకి ఎవరూ వెళ్లకుండా ఉండేందుకు కొర్రపోలు, శిరిగిరిపాడు, దోర్నాల గణపతి గుడి వద్ద ఫారెస్ట్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. మొత్తం మీద 120 మంది ప్రొటెక్షన్ వాచర్లు పులుల సంరక్షణలో ఉన్నారు. రాత్రి సమయంలో అడవి జంతువులు వచ్చి దాహం తీర్చుకుంటాయి. నల్లమల అటవీ ప్రాంతంలో సహజ కుంటల్లో వేసవిలో కూడా ఇక్కడ నీరు ఉండటం విశేషం. దీంతో అడవి జంతువులు ఇక్కడికి వచ్చి సేదతీరుతుంటాయి.



నీరుతాగేందుకు వచ్చిన దుప్పి



సాసర్ పిట్ వద్ద నీరు తాగుతున్న పులులు

ప్రత్యేక రక్షణ చర్యలు

నల్లమల అటవీ ప్రాంతంలో వన్యప్రాణులకు నీటి వసతి కల్పించడం, పులుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. నీటి కోసం జనవాసాల్లోకి రాకుండా ఉండేందుకు 150కి పైగా సాసర్‌పిట్‌లు ఏర్పాటు చేసి నీటిని అందిస్తున్నాం. జంతువులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. ఎత్తైన, అరుదైన వృక్షాలు, జంతువులు నల్లమలలో ఉన్నాయి. అగ్ని ప్రమాదాలు సైతం జరగకుండా చర్యలు తీసుకున్నాం.

– సందీప్ కృపాకర్, డీడీ మార్కాపురం

ఉప పోరులో పచ్చకుట్ర

- పైచేయి కోసం కక్కుర్తి రాజకీయాలు
- బలం లేకున్నా తెర వెనుక కుయుక్తులు
- ఒక్క సభ్యుడు లేని త్రిపురాంతకం మండలంలో అరాచకాలు
- కూటమి నాయకుడి ఆదేశాలే పోలీసులకు శిరోధార్యం
- పుల్లలచెరువు మండలంలోనూ ఇదే తీరు..



అరెస్టయిన ఆంజనేయరెడ్డికి ధైర్యం చెబుతున్న ఎమ్మెల్యే తాటిపర్తి

యర్రగొండపాలెం: మండల ప్రజా పరిషత్ ఉప ఎన్నికల్లో టీడీపీ కక్కుర్తి రాజకీయాలకు తెరతీసింది. నియోజకవర్గంలోని ఏ ఒక్క మండలంలో వారికి బలం లేకున్నా అధికారాన్ని అడ్డు పెట్టుకొని ఆ పార్టీ నేతలు పెద్ద ఎత్తున హడావుడి చేస్తున్నారు. త్రిపురాంతకం, పుల్లలచెరువు మండలంలో బలం లేకున్నా ఎంపీపీ పదవి కోసం కుట్రలకు పాల్పడుతున్నారు. ఈ నెల 27వ తేదీ జరగాల్సిన త్రిపురాంతకం ఎంపీపీ ఎన్నికలను జరగకుండా ఉండేలా నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారు. మండలంలో టీడీపీ వర్గానికి ఒక్క ఎంపీటీసీ సభ్యుడు కూడా లేకున్నా ఆ మండలంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీటీసీ సభ్యులపై అరాచకాలకు పాల్పడుతున్నారు. మండల ప్రజా పరిషత్ ఎన్నికల్లో తమదే పైచేయి అనిపించుకోవాలన్న దురుద్దేశంతో పోలీసులను ఉసిగొల్పుతున్నారు. మండలంలో తాజాగా నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో ఎన్నికలు సజావుగా జరిగే పరిస్థితి లేదన్న ప్రచారం జరుగుతోంది.

ఎంపీటీసీ సభ్యులపై అక్రమ కేసులు:

త్రిపురాంతకం ఎంపీపీ స్థానాన్ని తమ గుప్పెట్లో పెట్టుకోవటానికి కూటమి నాయకుడు పోలీసుల సహకారంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీ సభ్యులపై వేటు వేశాడు. మండలంలో ఉన్న మొత్తం 18 ఎంపీటీసీ సభ్యులకుగాను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన 17 మంది, ఒకరు ఇండిపెండెంట్ సభ్యుడిగా కొనసాగుతున్నారు. ఈ మండలంలో టీడీపీ వర్గానికి చెందినవారు అప్పట్లో ఏ ఒక్క స్థానంలో కూడా పోటీ చేయలేదు. పూర్తి స్థాయిలో మెజార్టీ ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన దూపాడు ఎంపీటీసీ సభ్యుడు కోట్ల సుబ్బారెడ్డి ఎంపీపీగా కొనసాగారు. అనారోగ్య పరిస్థితుల వలన ఆయన తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ఈ స్థానంలో అప్పటి వరకు వైస్ ఎంపీపీగా కొనసాగుతున్న త్రిపురాంతకంలోని అంబేడ్కర్ నగర్ ప్రాంతానికి చెందిన ఎంపీటీసీ సభ్యురాలు గొట్టిముక్కల రిబకమ్మ తాత్కాలికంగా ఎంపీపీ పీఠాన్ని అధిష్టించాల్సి వచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తమ పనులను చక్కబెట్టుకోవటానికి నియోజకవర్గ టీడీపీ నాయకుడు ఆమెకు ప్రలోభాలు పెట్టి ఆమె మెడలో పచ్చకండువా కప్పాడు. స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో ఎంపీపీ స్థానానికి ఎన్నిక అనివార్యంగా మారింది. అందుకు పూర్తిస్థాయిలో బలం ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీటీసీ సభ్యులు ఎంపీపీ స్థానానికి పోటీ చేయటానికి సిద్ధమయ్యారు. మాజీ ఎంపీపీ, వైఎస్సార్ సీపీ మండల నాయకుడు ఆళ్ల ఆంజనేయరెడ్డి ఉమ్మడివరం ఎంపీటీసీ స్థానానికి ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఆయన వెంట 10 మంది ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు. మిగిలిన ఏడుగురు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన మరో ఎంపీటీసీ సభ్యుడికి మద్దతు ఇస్తున్నారు. వీరిద్దరిలో ఎవరు ఎంపికైనా తమ పనులు చక్కబెట్టుకోవటానికి వీలు పడదని భావించిన సదరు నేత పరోక్షంగా రెండో వర్గానికి మద్దతు ఇస్తున్నాడు. ఈ నేపథ్యంలో బలం ఉన్న ఆంజనేయరెడ్డిని ఏదో ఒక రకంగా దెబ్బతీయాలన్న కుట్రతో ఆయన ముఖ్య అనుచరుడిగా ఉంటున్న ఒకరిని రెచ్చకొట్టారు. తన గుప్పెట్లో ఉన్న ఒక ఎంపీటీసీ సభ్యురాలిని రెండో వర్గానికి మద్దతు ఇచ్చేలా తెరవెనుక యత్నాలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అయినా ఆళ్ల ఆంజనేయరెడ్డి వెంటే మెజార్టీ సభ్యులు ఉన్నారు. ఇదిలా ఉండగా ఈ నెల 27వ తేదీన జరిగే మండల పరిషత్ సమావేశంలో ఉన్న సభ్యులకంటే ఒకరిద్దరు అదనంగా పాల్గొనాలి. లేకుంటే ఆ మరుసటి రోజుకు సమావేశం వాయిదా వేస్తారు. అప్పటికీ నిబంధనల ప్రకారం ఆ ఎంపీటీసీ సభ్యులు సమావేశానికి హాజరుకాలేకపోతే తిరిగి ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వరకు ఎంపీపీ పీఠంపై వైస్ ఎంపీపీ కొనసాగుతారు. ఈ నిబంధనను అడ్డుపెట్టుకొని టీడీపీ నాయకుడు నీచ రాజకీయాలకు తెరతీశాడు. ఎంపీపీగా పోటీ చేయటానికి సిద్ధంగా ఉన్న ఆళ్ల ఆంజనేయరెడ్డి తన ముఖ్య అనుచరుడిని కులంపేరుతో దూషించినట్లు, హత్య చేయటానికి ప్రయత్నించినట్లు పోలీసులతో కేసు నమోదు చేయించాడు. పోలీసులు కూడా కూటమి నాయకుడి ఆజ్ఞ ప్రకారం ఆంజనేయరెడ్డిపై వచ్చిన ఆరోపణలపై ఎటువంటి విచారణ జరపకుండా ఆఘమేఘాలపై కేసు నమోదు చేశారు. ఆయనతో పాటు మరో ఎంపీటీసీ సభ్యుడు ఎస్.సుబ్బారావును అరెస్ట్ చేశారు. ఈ చర్యతో వైఎస్సార్ సీపీలో ఉన్న బలమైన వర్గం బలహీనపడింది.

పుల్లలచెరువులోనూ ఇదే తంతు..

పుల్లలచెరువు మండల ఎంపీపీ స్థానానికి కూడా ఎన్నిక జరగాల్సి ఉంది. మండలంలో మొత్తం 15 ఎంపీటీసీ స్థానాలు ఉండగా వాటిలో 11 స్థానాలు వైఎస్సార్ సీపీ, 4 స్థానాలు టీడీపీ పక్షాన ఉన్నాయి. వైఎస్సార్ సీపీకి చెందిన ఎంపీటీసీ సభ్యుడు మందా లాజర్ ఎంపీపీగా కొనసాగుతూ అనివార్య కారణాలతో తన పదవికి రాజీనామా చేశారు. ఈ స్థానంలో వైస్ ఎంపీపీగా ఉన్న కందుల వెంకటయ్య ఎంపీపీ పీఠాన్ని అధిష్టించారు. కూటమి నాయకుడు ఈయనతోపాటు మరొకరి మెడలో పచ్చకండువాలు కప్పి టీడీపీలో చేర్చుకున్నాడు. అయినా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఆ మండలంలో మెజార్టీ ఉన్నప్పటికీ అక్కడ కూడా నీచ రాజకీయం నడిపేందుకు సిద్ధమవుతున్నారు. యర్రగొండపాలెం మండల ప్రజా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడి ఎన్నిక జరగాల్సి ఉంది. ఈ మండలంలో మొత్తం 18 ఎంపీటీసీ స్థానాల్లో ప్రస్తుతం 10 వైఎస్సార్ సీపీ, 8 టీడీపీ వర్గాలకు చెందిన ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు. కో ఆప్షన్ సభ్యుడిగా కొనసాగుతున్న ఎస్.విజయకుమార్ అనారోగ్యంతో మృతి చెందారు. ఈ స్థానంలో ఆయన కుటుంబంలోని ఒకరిని కో ఆప్షన్ సభ్యుడిగా నామినేషన్ వేసేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అవకాశం కల్పించారు. టీడీపీకి బలం లేకున్నా ఆ స్థానం కూడా తమకే దక్కేలా కుట్రలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

పోటీలో ఉన్న అభ్యర్థిని అరెస్టు చేయడం దుర్మార్గం

- వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కర రెడ్డి



జిల్లా జైలులో ఆంజనేయరెడ్డిని పరామర్శించి బయటకు వస్తున్న చెవిరెడ్డి భాస్కరరెడ్డి

ఒంగోలు టౌన్: ఎంపీపీగా పోటీలో ఉన్న అభ్యర్థిపై తప్పుడు కేసులు పెట్టి అరెస్టు చేసి జైల్లో పెట్టడం ఎంత మాత్రం సమర్థనీయం కాదని వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కర రెడ్డి అన్నారు. జిల్లా కారాగారంలో ఉన్న త్రిపురాంతకం ఎంపీటీసీ ఆళ్ల ఆంజనేయ రెడ్డిని సోమవారం ఆయన పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ 27వ తేదీ ఎన్నికలు పెట్టుకొని ఎంపీటీసీని తీసుకొచ్చి అరెస్టు చేయడం, తప్పుడు కేసులు పెట్టడం మంచి సంప్రదాయం కాదని స్పష్టం చేశారు. ఆంజనేయరెడ్డి ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధి అని, రేపు జరిగే ఎన్నికల్లో పోటీ చేయాల్సి ఉందని చెప్పారు. ఆయన మీద ఎస్సీ, ఎస్టీ కేసులతో పాటుగా ఎన్ని కేసులు ఉంటే అన్ని కేసులు పెట్టడం సమర్థనీయం కాదని, ఇలాంటి చర్యలను సభ్య సమాజం హర్షించదని చెప్పారు. ఇలాంటి తప్పుడు పనులు తాత్కాలికంగా నడవవచ్చు కానీ ప్రజలు అంగీకరించరన్నారు. ఈ విషయంపై ప్రజలు యావగించుకుంటున్నారని తెలిపారు. ప్రజా స్వామ్యానికి ఇది ప్రమాదకరమని, దీనిపై ప్రజలు తిరగబడతారని అన్నారు. తప్పుడు కేసులు పెట్టి బలవంతంగా జైలులో పెట్టినప్పటికీ పార్టీ మొత్తం ఆంజనేయ రెడ్డికి అండగా ఉంటుందని తెలిపారు. చెవిరెడ్డి వెంట రాష్ట్ర కార్యదర్శి కేవీ రమణారెడ్డి తదితరులు ఉన్నారు.

సమస్య తీరుస్తారా.. దూకేయమంటారా!

- ప్రకాశం భవనం ఎక్కి ఒకరు... మిద్దెక్కి మరొకరు
- తమ సమస్యలు పరిష్కరించాలంటూ నిరసన
- సమస్యలు పరిష్కరించకపోతే దూకుతామంటూ బెదిరింపులు
- ఇద్దరినీ కిందకు దింపి పోలీస్ స్టేషన్లకు తరలింపు



అగ్రహారం గేటు వద్ద మిద్దె ఎక్కి నిరసన తెలుపుతున్న తోటకూర శ్రీకాంత్, కింద ఉండి అతనితో మాట్లాడుతున్న టూ టౌన్ సీఐ శ్రీనివాసరావు


ఒంగోలు సబర్బన్: ప్రకాశం భవన్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరుగుతుండగా ప్రకాశం భవనం ఎక్కి ఒకరు నిరసన వ్యక్తం చేశారు. మరొకరు అగ్రహారం రైల్వే గేటు వద్ద అండర్ పాస్ నిర్మాణం సందర్భంగా తన ఇల్లు కొట్టేస్తున్నారంటూ అక్కడే సంతపేటలోని భవనం ఎక్కి నిరసన వ్యక్తం చేశారు. తమ సమస్యలు పరిష్కరించకపోతే దూకుతామంటూ బెదిరింపులకు దిగారు. వారిని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియాతో మాట్లాడి పరిష్కరిస్తామని ఒంగోలు టూ టౌన్ సీఐ మేడా శ్రీనివాసులు నచ్చజెప్పి కిందకు దింపేలా చర్యలు చేపట్టారు.

☛ ఒంగోలు నగరానికి చెందిన ఆసోది శంకర రెడ్డి గతంలో కూరగాయల మార్కెట్లో షాపు నిర్వహించుకునేవాడు. అయితే అతనికి కొంతమంది ద్వారా ప్రాణహాని ఉందని ఎప్పటి నుంచో తుపాకీ లైసెన్స్ కావాలంటూ దరఖాస్తు చేసుకున్నాడు. అధికారులు గన్ లైసెన్స్ ఇవ్వకుండా కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్నారంటూ ప్రకాశం భవన్ ఎక్కాడు. సకాలంలో గమనించిన ఒంగోలు టూ టౌన్ సీఐ మేడా శ్రీనివాసరావు అతనికి నచ్చచెప్పి కిందకు దిగేలా ఏర్పాటు చేశారు.

☛ అగ్రహారం గేటు సమీపంలో రోడ్డు పక్కనే నివాసం ఉంటున్న తోటకూర శ్రీకాంత్ రైల్వే అండర్ పాస్ వల్ల తన ఇల్లు పడగొడతారని, అందుకు నిరసనగా సంతపేటలోని ఒక భవనం ఎక్కి తన నిరసన వ్యక్తం చేశాడు. సమాచారం తెలుసుకున్న టూ టౌన్ సీఐ మేడా శ్రీనివాసరావు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సమస్య పరిష్కారం కోసం ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని చెప్పి భవనం మీద నుంచి కిందకు దింపారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపాలి

- అధికారులను ఆదేశించిన డీఆర్‌ఓ చిన ఓబులేసు



అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్‌ఓ చిన ఓబులేసు

ఒంగోలు సబర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలను నిర్దేశించిన గడువులోపు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పరిష్కారం చూపాలని జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు అధికారులను ఆదేశించారు. సోమవారం ఒంగోలు కలెక్టరేట్‌లోని మీ కోసం సమావేశ మందిరంలో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వరకుమార్, పార్థసారథి, జాన్సన్, విజయజ్యోతిలతో కలసి పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వచ్చిన అర్జీలను సత్వరం పరిష్కరించేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీదారులకు గత సోమవారం నుంచి భోజన సదుపాయాన్ని ఉచితంగా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో 292 వినతులు వచ్చాయి.

మేస్త్రీలను తొలగించటం అన్యాయం...

ఒంగోలు మునిసిపల్ కార్పొరేషన్ లో 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న తమను తొలగించడం అన్యాయమని మేస్త్రీలు పేర్కొన్నారు. ఈ మేరకు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మేస్త్రీలు అర్జీ అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి మేస్త్రీలు నిబద్ధతతో పని చేస్తున్నారన్నారు. వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. అర్జీ ఇచ్చిన వారిలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లా సహాయక కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, శ్రీరామ్ శ్రీనివాసరావు ఉన్నారు.

ప్రశాంతంగా పదో తరగతి పబ్లిక్ పరీక్షలు

- గైర్హాజరైన 444 మంది విద్యార్థులు

ఒంగోలు సిటీ: పదో తరగతి పబ్లిక్ పరీక్ష మాథ్స్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. ఈ పరీక్షకు రెగ్యులర్ విద్యార్థులు 29,612 మందికి గాను 29,168 మంది హాజరయ్యారు. 444 మంది గైర్హాజరయ్యారు. అలాగే ప్రైవేటు విద్యార్థులు 37 మందికి గాను 18 మంది హాజరవగా, 19 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలు నిర్వహించడానికి జిల్లాలో 183 సెంటర్లు కేటాయించారు. 87 ఫ్లయింగ్ స్క్వాడ్స్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. డీఎల్‌ఓ 6 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ పదో తరగతి మ్యాథమేటిక్స్ పరీక్షకు మొత్తం 1778 మంది విద్యార్థులకు గాను, 889 మంది హాజరవగా, 489 మంది గైర్హాజరయ్యారు. 23 ఫ్లయింగ్ స్క్వాడ్స్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

క్లుప్తంగా

భార్యను చంపిన భర్తకు జీవిత ఖైదు

చినగంజాం: భార్యను చంపిన కేసులో భర్తకు కోర్టు జీవిత ఖైదు విధించిన సంఘటన బాపట్ల జిల్లా చినగంజాం మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు అందించిన వివరాల మేరకు చినగంజాం గ్రామం మహాలక్ష్మి కాలనీకి చెందిన కత్తి శ్రీనుకు తన భార్య అయిన కత్త దుర్గ(30)తో మనస్పర్థలు వచ్చాయి. దాని కారణంగా భర్తతో విభేదించి ఆమె పుట్టింటికి వచ్చింది. తల్లిదండ్రులు మల్లవరపు అంజయ్య, రాఘవమ్మ ఇంటిలో తనబిడ్డలతో నివశిస్తోంది. వారిద్దరి మనస్పర్థలు మనసులో పెట్టుకొని భర్త కత్తి శ్రీను గతేడాది జూన్ 7వ తేదీ చెట్లు నరికే కత్తితో దుర్గ ఉంటున్న ఇంటిలోకి వెళ్లి ఆమెతో గొడవ పెట్టుకొని మెడమీద, భుజాల మీద కత్తితో నరకడంతో ఆమె అక్కడికక్కడే చనిపోయింది. ఈ ఘటనకు సంబంధించి మృతురాలి తల్లి మల్లవరపు రాఘవమ్మ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా అప్పటి ఎస్ఐ ఎం శ్రీనివాసరావుకేసు నమోదు చేశారు. అప్పటి సీఐ బత్తుల శ్రీనివాసరావు దర్యాప్తు చేసి నిందితుడ్ని రిమాండ్‌కు పంపారు. ఇప్పటి సీఐ వైవీ రమణయ్య దర్యాప్తు పూర్తి చేసి నివేదికను కోర్టుకు సమర్పించారు. అనంతరం అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై ప్రశాంతి కుమారి వాదనలతో ఏకీభవించిన ఒంగోలు మూడో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి డీ రాములు నిందితుడికి యావజ్జీవ కఠిన కారాగార శిక్ష, రూ.1600 జరిమానా విధించారు. నిందితుడ్ని శిక్షించడంలో చురుకైన పాత్ర పోషించిన ఇంకొల్లు అప్పటి సీఐ బత్తుల శ్రీనివాసరావు, ఇప్పటి సీఐ వైవీ రమణయ్య, చినగంజాం పోలీస్ స్టేషన్ ఎస్ఐ శీలం రమేష్, కోర్టు కానిస్టేబుళ్లు నాగేశ్వరరావు, హెచ్‌సీ వై శ్రీనివాసరావులను బాపట్ల ఎస్పీ తుషార్ డూడీ ప్రత్యేకంగా అభినందించారు.

మాజీ ఎంపీపీ ఆంజనేయరెడ్డికి రిమాండ్

యర్రగొండపాలెం: త్రిపురాంతకం మండల మాజీ ఎంపీపీ ఆళ్ల ఆంజనేయరెడ్డిని పోలీసులు సోమవారం మార్కాపురం కోర్టులో హాజరుపరిచారు. ఈ మేరకు మేజిస్ట్రేట్ ఏప్రిల్ 4వ తేదీ వరకు రిమాండ్ విధించారు. ఆంజనేయరెడ్డి ఒకరిని కులం పేరుతో దూషిస్తు దాడి చేశారని యర్రగొండపాలెం పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. రిమాండ్‌లో ఉన్న ఆయనను ఒంగోలు సబ్ జైలుకు తరలించారు.

పీహెచ్‌సీ వైద్యుడిపై అట్రాసిటీ కేసు

రాచర్ల: మండలంలోని అనుమలవీడు గ్రామానికి చెందిన యామా సంజయ్ అనే వ్యక్తి సోమవారం అదే గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లాడు. డాక్టర్లు విధులకు హాజరు కావడం లేదు, సిబ్బంది కూడా సమయపాలన పాటించడం లేదంటూ సెల్‌ఫోన్‌తో ఫొటోలు తీశాడు. అయితే ఈ విషయమై పీహెచ్‌సీ డాక్టర్ భానుకుమార్‌రెడ్డి ఫోన్‌లో మాట్లాడుతూ తనను దూషించాడని స్థానిక పోలీస్ స్టేషన్‌లో సంజయ్ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై ఆదిశేషయ్య తెలిపారు.

మార్కాపురం మున్సిపల్ బడ్జెట్ రూ.45.26 కోట్లు

- నీటి సరఫరా, పారిశుధ్యం, వీధిలైట్లకు ప్రాధాన్యం
- బడ్జెట్‌లో 15 శాతం ఎస్సీ, 7.5 శాతం ఎస్టీ, 5 శాతం స్త్రీ, శిశు సంక్షేమాభివృద్ధికి..
- బడ్జెట్ ప్రవేశపెట్టిన మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ

మార్కాపురం టౌన్: మార్కాపురం పురపాలక సంఘానికి సంబంధించి 2025–26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌ను మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ అధ్యక్షతన సోమవారం ప్రవేశపెట్టారు. నీటి సరఫరా నిర్వహణ, వీధి దీపాలు, డ్రైనేజీలతో పాటు ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధిత ఆదాయం మొత్తాన్ని కేటాయించారు. మున్సిపాలిటీలో ఆస్తి పన్ను వసూళ్లు, సగటు ఆదాయం, దుకాణాల అద్దెలు, బంకులు, మార్కెట్లపై వచ్చే సాధారణ ఆదాయం, ప్రభుత్వ గ్రాంట్లను మూల ధన ఆదాయంగా పరిగణలోకి తీసుకున్నట్లు చైర్మన్ పేర్కొన్నారు.


మాట్లాడుతున్న చైర్మన్ చిర్లంచర్ల కృష్ణ

■ 2024–25 ఆర్థిక సంవత్సన మున్సిపల్ బడ్జెట్ అంత్య నిల్వ రూ.11,50,26,003 కోట్లు, 2025–26 బడ్జెట్‌కు సంబంధించిన ఆదాయం రూ.33,76,66,400 కోట్లు వెరసి మొత్తం రూ.45,26,92,403తో బడ్జెట్‌ను ప్రవేశపెట్టినట్లు చైర్మన్ వివరించారు. కాగా 2026–27 బడ్జెట్ అంత్య నిల్వగా రూ.16,81,35,143 కోట్లను చూపారు.

■ 2025–26 సంవత్సరానికి సంబంధించి గ్రాంట్లు, మూలధన ఆదాయంలో 40 శాతాన్ని మురికివాడల్లో నీటి సరఫరా, వీధి దీపాలు, పారిశుధ్యం తదితర అభివృద్ధి కార్యక్రమాలకు, అలాగే 15 శాతం నిధులను షెడ్యూల్ కులాల అభ్యున్నతికి, 7.5 శాతాన్ని షెడ్యూల్ తెగల అభ్యున్నతికి, 5 శాతం నిధులను స్త్రీ, శిశు సంక్షేమాభివృద్ధికి కేటాయించారు.


సమస్యలను సభ దృష్టికి తెస్తున్న వైస్ చైర్మన్ ఇస్మాయిల్, పక్కన ఇతర కౌన్సిలర్లు

■ జనరల్ ఫండ్ నుంచి నీటి సరఫరాకు 20 శాతం, రోడ్ల అభివృద్ధికి 19 శాతం, డ్రైనేజీలకు 13 శాతం నిధులను ఖర్చు చేయాలని నిర్ణయించారు. అభివృద్ధి పనుల్లో భాగంగా మురికివాడల్లో 40 శాతం, షెడ్యూల్ కులాల అభివృద్ధికి 15 శాతం, షెడ్యూల్ తెగల అభివృద్ధికి 8 శాతం, స్త్రీ, శిశు సంక్షేమానికి 5 శాతం, దివ్యాంగుల అభ్యున్నతికి 3 శాతం నిధులు కేటాయించామని పేర్కొన్నారు. సమావేశంలో మున్సిపల్ డీఈ శ్రీనివాసులు, ఏఈలు, శానిటరి ఇన్స్‌పెక్టర్, కౌన్సిలర్‌లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్ సరే అభివృద్ధి ఏదీ?

మున్సిపల్ బడ్జెట్ అనంతరం సాధారణ సమావేశాన్ని చైర్మన్ బాలమురళీకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్ మాట్లాడుతూ.. బడ్జెట్‌లో వివిధ పనులకు నిధులు కేటాయిస్తున్నారేగానీ అవి అమలుకు నోచుకోవడం లేదని సభ దృష్టికి తీసుకొచ్చారు. పార్కుల అభివృద్ధికి రూ.11.50 లక్షలు కేటాయించారని, అయితే పట్టణంలోని రెండు పార్కుల్లో ఆట వస్తువులు, జిమ్ పరికరాలు మరమ్మతులకు గురై నెలలు గడుస్తున్నా పట్టించుకోలేదన్నారు. సక్రమంగా నీటి సరఫరా చేసి పారిశుధ్యం, వీధిలైట్ల సమస్యలు పరిష్కరిస్తే ప్రజలు సంతోషిస్తారన్నారు. సాగర్ నీరు ఎప్పుడు సరఫరా అవుతాయో ఎవరికీ అంతుపట్టడం లేదన్నారు. పైప్‌లైన్‌కు మరమ్మతులు చేస్తున్నామని చెప్పడమే మున్సిపల్ సిబ్బందికి సరిపోతోందంటూ సమస్య తీవ్రతను సభలో ఏకరువు పెట్టారు. పట్టణంలో పారిశుధ్యం దారుణంగా తయారైందని ఆరోపించారు. తమ వార్డులో ఫాగింగ్ చేసిన పాపాన పోలేదని, చేసినట్లు నిరూపిస్తే రాజీనామా చేస్తానని ప్రకటించారు. షాదీఖానాకు నిధులు కేటాయించి నిర్మాణ పనులు పూర్తి చేయాలని కోరారు.

■ ఫాగింగ్ మిషన్లు కొత్తవి కొనుగోలు చేసి వార్డు శానిటేషన్ సెక్రటరీలకు అప్పగించాలని కౌన్సిలర్ బుశ్శెట్టి నాగేశ్వరరావు కోరారు. ప్రస్తుతం ఉన్న రెండు ఫాగింగ్ మిషన్లు పట్టణంలోని 35 వార్డులకు సరిపోవడం లేదని, బడ్జెట్‌లో నిధులు కేటాయించి నూతనంగా 10 మిషన్లు కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. సచివాలయాల వారీగా బ్లీచింగ్, శానిటేషన్ పరికరాలు, ఫాగింగ్, పారిశుధ్య పనుల బాధ్యతలు అప్పగించి అమలు చేసేలా చూడాలన్నారు.

■ గడియార స్తంభం వద్ద ఉన్న గాంధీ పార్కు పర్యవేక్షణ లేక అధ్వానంగా తయారైందని, అభివృద్ధి చేయాలని కౌన్సిలర్ డాక్టర్ కనకదుర్గ కోరారు. పార్కులో నీటి సౌకర్యం కల్పించి పచ్చదనం పెంపొందించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే పట్టణంలో కోతులు, కుక్కల బెడద ఎక్కువగా ఉండటంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని, సమస్యను తక్షణమే పరిష్కరించాలని సభ దృష్టికి తీసుకొచ్చారు.

■ కౌన్సిలర్లు లేవనెత్తిన సమస్యలపై కమిషనర్ నారాయణరావు మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్న 2 మిషన్లతో వార్డుల వారీగా ఫాగింగ్ చేయిస్తున్నామని, దోమల సమస్య ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో అర గంట కేటాయిస్తున్నామని చెప్పారు. సాగర్ నీటి పైప్‌లైన్ తరచూ మరమ్మతులకు గురవుతున్నందున సకాలంలో ప్రజలకు మంచినీరు అందించలేకపోతున్నామని అంగీకరించారు. పార్కుల అభివృద్ధిపై దృష్టి సారిస్తామని చెప్పారు. కుక్కలను చంపే హక్కు తమకు లేదని, ఫ్యామిలీ ప్లానింగ్ ఇంజక్షన్లు ఇచ్చి వదిలేస్తున్నామని పేర్కొన్నారు. వార్డుల్లో పారిశుధ్య సమస్యను శానిటేషన్ సెక్రటరీల దృష్టికి తీసుకు రావాలని కౌన్సిలర్లను కోరారు.

పారా లీగల్ వలంటీర్లకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు: మండల న్యాయసేవాధికార కమిటీలు, జిల్లా న్యాయసేవాధికార సంస్థలో స్వచ్ఛందంగా న్యాయ సేవా సహాయకులు(పారా లీగల్ వలంటీర్)గా పనిచేసేందుకు ఆసక్తి ఉన్న వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి సోమవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ప్రజలకు న్యాయపరమైన సలహాలివ్వడంతోపాటు చట్ట పరిధిలో న్యాయం చేయాలనే ఆలోచన, విషయ పరిజ్ఞానం ఉన్నవారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని స్పష్టం చేశారు. ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పత్రం, సంబంధిత విద్యార్హత పత్రాలతో జిల్లా న్యాయస్థానం ప్రాంగణంలోని న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో ఏప్రిల్ 4వ తేదీలోగా స్వయంగా లేదా పోస్టు ద్వారా దరఖాస్తులు సమర్పించవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హత కలిగిన స్వచ్ఛంద సేవా సంస్థల్లో పనిచేసేవారు, సామాజిక కార్యకర్తలు, పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, పత్రికా విలేకరులు, న్యాయశాస్త్రం అభ్యసించే విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్తలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. న్యాయసేవా సహాయకులుగా నియమితులైన వారికి గౌరవ వేతనం మాత్రమే అందిస్తామని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు ఇంటర్ ఉత్తీర్ణత కలిగి ఉండాలని, దరఖాస్తుల నమూనాలను హెచ్‌టిటిపి:డిస్ట్రిక్స్.ఈకోర్ట్స్.జీవోవి.ఇన్/ప్రకాశం వెబ్‌సైట్‌లో పొందవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సూచించారు.

అంధులం.. అడుగుతున్నాం న్యాయం

- 2022–23 బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ ప్రక్రియపై విచారించాలి
- కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శనలో అంధుల డిమాండ్


కలెక్టరేట్ ముందు నిరసన తెలుపుతున్న అంధులు

ఒంగోలు వన్‌టౌన్: 2022–23 విభిన్న ప్రతిభావంతుల బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లాలోని నిరుద్యోగ విజువల్లీ చాలెంజ్డ్ అభ్యర్థులు సోమవారం ఒంగోలు కలెక్టరేట్ ముందు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 1.3 పద్ధతిలో కొన్ని పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానించిన అధికారులు మూడేళ్లు కాలయాపన చేశారన్నారు. టైపిస్టు పోస్టుకు 1.3 కాకుండా 1.4 పద్ధతిలో మరొకరని జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ జి.అర్చన చేర్చారని, అదేమని అడిగితే జేసీ ఆదేశాల మేరకు చేర్చినట్లు తెలిపారన్నారు. విభిన్న ప్రతిభావంతుల శాఖ వైఖరిపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. మూడేళ్లు గడిచిపోవడంతో ప్రస్తుత పరిస్థితి ఏమిటో అర్థం కావడం లేదన్నారు. దివ్యాంగులు పొందాల్సిన ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లు అన్ని విధాలుగా నష్టపోతున్నారన్నారు. నోటిఫికేషన్‌లో పేర్కొన్న విధంగా 1:3 పద్ధతిలోనే పోస్టులను భర్తీ చేయాలని, లేని పక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎల్.అనిల్ కుమార్, ఇతర విజువల్లీ చాలెంజ్డ్ నిరుద్యోగులు పాల్గొన్నారు.

ఖాకీచకుడు.. కాటేయజూస్తున్నాడు

- కానిస్టేబుల్ తీరుపై కలెక్టరేట్ ఎదుట వివాహిత ధర్నా


పిల్లలతో కలిసి కలెక్టరేట్ గేట్ వద్ద బైఠాయించిన హర్షవర్థిని

ఒంగోలు టౌన్: భర్త మరొకరితో వివాహేతర సంబంధం నెరుపుతూ తనను పట్టించుకోవడం లేదని న్యాయం కోసం పోలీస్ స్టేషన్‌కు వెళ్తే అక్కడ కానిస్టేబుల్ అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని ఆరోపిస్తూ సోమవారం ఓ మహిళ కలెక్టరేట్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. సంచలనం సృష్టించిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి.. ఒంగోలు నగరం కమ్మపాలేనికి చెందిన జి.హర్ష వర్థిని జరుగుమల్లి మండలం కామేపల్లికి చెందిన నవీన్‌తో 2018లో వివాహమైంది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు సంతానం. మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్న నవీన్ భార్యాబిడ్డలను పట్టించుకోవడం మానేశాడు. ఈ నేపథ్యంలో న్యాయం కోసం ఒంగోలు టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లింది. అయితే అక్కడి కానిస్టేబుల్ అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని ఆరోపిస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట హర్షవర్థిని తన పిల్లలతో సహా బైఠాయించింది. టూటౌన్ సీఐ మేడా శ్రీనివాసరావుతోపాటు మహిళా కానిస్టేబుళ్లు ఆమెకు సర్దిచెప్పేందుకు ప్రయత్నించినా మొండికేయడంతో కలెక్టరేట్ మెయిన్ గేటు వద్ద కాసేపు గందరగోళం నెలకొంది. జనాలు గుమిగూడడంతో ట్రాఫిక్ స్తంభించింది. కలెక్టర్‌ను కలిసి సమస్య తెలియజేయాలని సీఐ సూచించగా.. అక్కడకు వెళ్లినా పోలీసుల దగ్గరకే పంపిస్తారని, తనకు న్యాయం జరగదని పేర్కొనడం గమనార్హం. న్యాయం జరిగేలా చూస్తామని సీఐ చాలా సేపు బతిమాలడంతో ఎట్టకేలకు ఆమె ఆందోళన విరమించింది.

అశ్వ వాహనంపై గోవిందుడు

కొనకనమిట్ల: వెలుగొండ క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. సోమవారం శ్రీవారు అశ్వ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేకంగా అలంకరించిన శ్రీవారి ఉత్సవ మూర్తులను వేదపండితుల మంత్రోచ్చారణలు, మేళతాళాల నడుమ ఊరేగించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. వేదపండితులు ప్రసాదాచార్యులు, భార్గవాచార్యులు స్వామివారికి అర్చనలు అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. గంగాభవాని సన్నిధితో పాటు బలిహోర గంగమ్మతల్లి ఆలయంలో భక్తులు పూజలు చేశారు. మంగళవారం పూర్ణాహుతి, వసంతోత్సవం, చక్రతీర్థం, ధ్వజ అవరోహణ, కుంబ ప్రోక్షణ కార్యక్రమాలు, శ్రీవారి ఉత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి తెలిపారు.


ప్రత్యేక అలంకరణలో శ్రీవారి ఉత్సవమూర్తులు

ఇఫ్తార్ విందులక్కర్లేదు.. వక్ఫ్ బిల్లుపై వైఖరేంటి?

- కూటమి నేతల ఇఫ్తార్ విందులను బహిష్కరించండి
- ముస్లింలకు ఎస్‌డీపీఐ నాయకుడు అబ్దుల్ సత్తార్ పిలుపు

ఒంగోలు టౌన్: కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతు తెలుపుతున్న కూటమి పాలకులు ఇచ్చే ఇఫ్తార్ విందులను ముస్లింలు బహిష్కరించాలని సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా(ఎస్‌డీపీఐ) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అబ్దుల్ సత్తార్ సోమవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. దక్షిణాది రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక, కేరళ ప్రభుత్వాలు వక్ఫ్ సరవరణ బిల్లుకు మద్దతు ఇవ్వబోమంటూ బహిరంగంగానే ప్రకటించాయని తెలిపారు. వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ ముస్లిం సంఘాలు రాష్ట్ర వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు, ధర్నాలు చేస్తున్నప్పటికీ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం తమ వైఖరిని స్పష్టంగా ప్రకటించక పోవడాన్ని తప్పుపట్టారు.


అబ్దుల్ సత్తార్

ముస్లిం సమాజానికి ఇఫ్తార్ విందులు అవసరం లేదని, వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకించడమే కావాలన్నారు. జనసేన ఆవిర్భావ సభలో పవన్ కళ్యాణ్ మక్కా గురించి, ప్రవక్త గురించి విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసినప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు అభ్యంతరం చెప్పకపోవడం వెనక అసలు మతలబు ఏమిటని ప్రశ్నించారు. ఉప ముఖ్యమంత్రిని అదుపులో పెట్టాల్సిన బాధ్యత సీఎం మీదనే ఉందన్నారు. వక్ఫ్ చట్టానికి మద్దతు ఇస్తే ముస్లింలు జీవితాంతం చంద్రబాబును నమ్మేది లేదని, ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఇది యామని మచ్చగా మిగిలిపోవడం ఖాయమని పేర్కొన్నారు. ఒకవైపు ముస్లింలను ద్వేషిస్తూ.. మరోవైపు ఇఫ్తార్ విందులు ఇవ్వడం మానుకోవాలని హితవుపలికారు.

రోడ్డు ప్రమాదంలో కనిగిరి యువకుడు దుర్మరణం


మృతుడు బత్తుల యాగయ్య

యడ్లపాడు(పల్నాడు జిల్లా): రోడ్డు దాటుతున్న ఫోర్‌వీల్ ఆటోడ్రైవర్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన సోమవారం పల్నాడు జిల్లా యడ్లపాడు మండల కేంద్రంలో హైవే బైపాస్ వద్ద చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కనిగిరి మండలం కూచిపూడిపల్లి గ్రామానికి చెందిన బత్తుల యాగయ్య ఫోర్‌వీల్ టాటాఇంట్రా వాహనంలో గుంటూరు నుంచి కనిగిరికి ఇంటి సామగ్రి లోడుతో ఆదివారం రాత్రి బయలుదేరాడు. మండలంలోని తిమ్మాపురం హైవే బైపాస్ ఎక్కగానే ఫోర్‌వీల్ వాహనం అదుపుతప్పి ముందు వెళ్తున్న కారును వెనుక నుంచి ఢీకొంది. దీంతో కారు యజమానితో డ్రైవర్ యాగయ్య మాట్లాడి తిరిగి తన వాహనం వద్దకు వస్తున్న క్రమంలో.. అదే సమయంలో అటువైపు దూసుకువచ్చిన గుర్తు తెలియని వాహనం యాగయ్యను ఢీకొంది. దీంతో తలకు తీవ్ర గాయాలైన యాగయ్య (23) సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న మృతుని తల్లిదండ్రులు ఏడుకొండలు, వరమ్మ, బంధువులతో యడ్లపాడుకు చేరుకున్నారు. తల్లి వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.


మొదటి ప్రమాదంలో యాగయ్య వాహనం ముందు భాగం దెబ్బతిన్న దృశ్యం

ఎయిడెడ్ ఉద్యోగులకు డీఏ ప్రకటించాలి

ఒంగోలు సిటీ: ప్రభుత్వ ఎయిడెడ్ ఉద్యోగులకు ఉగాది కానుకగా డీఏ ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.వెంకట్రావు, ప్రభాకర్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ ప్రకటించినందున, రాష్ట్రంలోనూ పెరిగిన నిత్యవసర ధరలకు అనుగుణంగా ఉగాది కానుకగా డీఏలు ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు గ్రాట్యుటీ సొమ్ము అందజేయాలని, ప్రస్తుతం పని చేస్తున్న ఉద్యోగులకు సరెండర్ లీవ్, కరువు భత్యం బకాయిలు విడుదల చేయాలని కోరారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

కొండపి: పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని గురప్పడియ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మక్కెన బోడెయ్య(65) మేకలను మేపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. రోజూమాదిరిగానే మేకలు తోలుకొని పొలానికి వెళ్లాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న బోడెయ్య పురుగు మందు తాగి పొలంలోనే పడిపోయాడు. సాయంత్రం అటుగా వెళ్తున్న కూలీలు గమనించి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. అపస్మారక స్థితిలో పడి ఉన్న బోడెయ్యను ఓ ఆటోలో కొండపి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. ఆయన భార్య మూడేళ్ల క్రితం క్యాన్సర్‌తో బాధపడుతూ మరణించింది. యేసయ్య అనే కుమారుడు ఉన్నాడు.

టీబీపై వ్యాసరచనలో కొమరోలు మెడికో ప్రతిభ

కొమరోలు: ప్రపంచ టీబీ నివారణ దినోత్సవం సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీల్లో కొమరోలు మండలం బొద్దువానిపల్లె గ్రామానికి చెందిన మెడికో అక్కలరెడ్డి పరమేశ్వరి సత్తా చాటి ప్రథమ స్థానంలో నిలిచింది. శ్రీకాకుళం జిల్లా రాజోలులోని గ్రేట్ ఈస్టర్న్ మెడికల్ కళాశాల(జెమ్స్)లో ఎంబీబీఎస్ 4వ సంవత్సరం చదువుతున్న పరమేశ్వరికి సోమవారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ పీఎస్ వర్మ చేతుల మీదుగా మెడల్ బహూకరించారు. ఈ సందర్భంగా పరమేశ్వరిని ఆమె తండ్రి ఈశ్వర్‌రెడ్డి, గ్రామస్తులు అభినందించారు.


పరమేశ్వరికి మెడల్ అందిస్తున్న ఐఎంఏ చైర్మన్ డాక్టర్ శర్మ

సీసీఎస్ కార్యాలయాన్ని మార్చడం సరికాదు

- వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ అవుల రాధాకృష్ణ

ఒంగోలు టౌన్: విజయవాడలోని బస్ భవన్‌లో ఉన్న సీసీఎస్ కార్యాలయాన్ని ఆర్టీసీ బస్టాండుకు 6 కిలోమీటర్ల దూరంలోకి మార్చడం సరైన నిర్ణయం కాదని ది పీటీడీ వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ అవుల రాధా కృష్ణ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం ఉన్న సీసీఎస్ కార్యాలయం ఆర్టీసీ ఉద్యోగులకు అందుబాటులో ఉందని, ఆన్‌డ్యూటీలో ఉన్న ఉద్యోగి సైతం ఆఫీసుకు వెళ్లి పని చేసుకొని వచ్చే అవకాశం ఉందని తెలిపారు. దీన్ని పరిగణలోకి తీసుకోకుండా ఎన్ఎంయూఏ ఆధ్వర్యంలోని సీసీఎస్ పాలక మండలి అనాలోచిత నిర్ణయం వలన ఉద్యోగులు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ఉద్యోగుల డబ్బులతో ఒక ప్రైవేటు భవనంలోని పై అంతస్తును రూ.4 కోట్లతో కొనుగోలు చేసి మరీ సీసీఎస్ కార్యాలయాన్ని మార్చాల్సిన అవసరం ఏమొచ్చిందో చెప్పాలని ప్రశ్నించారు. గతంలో విద్యాధర పురం హాస్పిటల్ ఆవరణలో సీసీఎస్ ఆఫీసు కోసం కేటాయించిన స్థలంలో కాకుండా ప్రైవేటు వ్యక్తుల నుంచి అధిక ధరకు కొనుగోలు చేయడం వెనక మతలబు ఏమిటో చెప్పాలన్నారు. బస్ భవన్‌లో ఉన్న కార్యాలయానికి అద్దె లేదని, కరెంటు బిల్లులు కూడా చెల్లించాల్సిన అవసరం లేదని, కానీ ప్రైవేటు భవనంలో మెయింటెనెన్స్ ఖర్చులు, మున్సిపల్ పన్ను, వాటర్ ట్యాక్స్‌లు కలిసి ఉద్యోగులపై పెను భారం పడుతుందని వివరించారు. కుటుంబ నేస్తం పథకాన్ని వ్యతిరేకించిన ఎన్ఎంయూఏ నాయకులు తమ వ్యక్తిగత సుఖాల కోసం ఉద్యోగుల సొమ్మును వాడుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఉద్యోగుల పిల్లల స్కాలర్ షిప్‌ల ప్రతి ఏడాది చెల్లించే సొమ్మును ఒక్క రూపాయి కూడా పెంచని ఎన్ఎంయూఏ పాలకమండలి ఎవరి సొమ్మని రూ.4 కోట్లను అక్రమంగా వాడుకుంటోందని ధ్వజమెత్తారు. సీసీఎస్ సభ్యులంతా ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించాలని, ఈ నెల 26వ తేదిన అమలాపురంలో జరిగే సీసీఎస్ జనరల్ బాడీ సమావేశంలో ప్లకార్డ్స్ ప్రదర్శిస్తూ తన నిరసన తెలియజేయాలని పీటీడీ వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ తరఫున విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు.

30 నుంచి రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీ

తర్లుపాడు: మండలంలోని జగన్నాథపురంలో ఈనెల 30వ తేదీ నుంచి రాష్ట్ర స్థాయిలో జేఎస్‌పీఎల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు కె.కాశీ, ఎం.అశోక్, టి.కాశయ్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. విజేతలకు మొదటి బహుమతిగా ట్రోఫీతోపాటు రూ.70 వేలు, రెండో బహుమతి రూ.50 వేలు, మూడో బహుమతి రూ.30 వేలు, నాలుగో బహుమతి రూ.20 వేలు, ఐదో బహుమతి రూ.10 వేలు అందించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి గేమ్‌లో మాన్ ఆఫ్ ద మ్యాచ్‌తోపాటు మ్యాన్ ఆఫ్ ద సీరిస్ బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న జట్లు రూ.2 వేలు ప్రవేశ రుసుం చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. వివరాలకు 77806 03930, 93468 70549ను సంప్రదించాలని కోరారు.

దూపాడు ఎస్ఎస్ ట్యాంక్‌లో గుర్తు తెలియని శవం


ఎస్ఎస్ ట్యాంక్‌లో పడిఉన్న మహిళ శవం

యర్రగొండపాలెం: త్రిపురాంతకం మండలంలోని దూపాడు సమీపంలో ఉన్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో గుర్తు తెలియని మహిళ శవాన్ని సోమవారం పోలీసులు గుర్తించారు. దాదాపు 50 ఏళ్ల వయసున్న మహిళ ఎస్ఎస్ ట్యాంక్‌లో దూకి ఆత్మహత్య చేసుకుందా లేదంటే ఎవరైన హతమార్చి అందులో పడవేశారా అన్న కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివబసవరాజు తెలిపారు.